SECOND COPY 292

# భగవాన్ నేనేమీ కోరను!

"పార్వతీ! ఏదో పిశాచం నిన్నావరించింది. అది ఏనాడు నిన్ను వదిలివెళ్తుందో, ఆనాడే నీకు వాస్తవిక పరిస్థితులు అర్థమౌతాయి. అందాకా, కనీసం మీ అమ్మానాన్నల దగ్గరుంటే, మన ఈ వాతావరణాన్ని మరచి, కొంత ప్రశాంతత పొందగలుగుతావు. ఉత్తరాలు వ్రాస్తుండు. ఎప్పుడు నీకు రావాలనిపిస్తే, అప్పుడు రావచ్చు. పిల్లలు జాగ్రత్త! నీదగ్గర వున్న ముప్పై రూపాయలూ ఖర్చయిపోగానే, వ్రాయి. వెంటనే పంపిస్తాను డబ్బు. సిగ్నల్ యిచ్చారు జాగ్రత్త. గోపిగాడు చేతులు బయటపెట్టకుండా చూచుకో."

మెల్లిగా కదిలిన రైలువెంటనడుస్తూ చెబుతున్న విశ్వం, రైలు వేగాన్ని అందుకోవటం చూచి ఆగిపోయాడు. భర్త ముఖంలోని ఆ ప్రశాంతతా, అనురాగమూ, ఆ వేదనా చూస్తుంటే, గబుక్కున రైల్లోంచి ఉరికేద్దామనిపించింది పార్వతికి. కనుమరుగైపోయిన స్టేషనూ, దూరమౌతున్న ఊరూ చూచి, ఉసూరుమని నిట్టూర్చింది పార్వతి. గోపీ కిటికీదగ్గర కూర్చుని వింతగా చూస్తున్నాడు. పాప మెల్లగా తూగుతోంది బెర్త్ మీద పడుకుని.

'ఏమిటో ఇదిమిత్థమని తేలని బాధ జివ్వున బాధిస్తూంది. ఈ ఆవేదనకు అంతెక్కడ, భగవాన్ !' అనుకుంది పార్వతి, పాపను సరిగా పడుకోబెట్టి, గోపీమీద చెయ్యివేసి కూర్చుంటూ. విశ్వం మాటలు చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. "ఏదో పిశాచం నిన్నావరించింది!" నిజమే! ఆ పిశాచమేదో నెలరోజులక్రితం తన నెత్తిన ఎక్కికూర్చుంది. అది మొదలు తనేదో మారిపోయింది. విశ్వం సహనం చూపేకొద్దీ, తను సాధించింది. చివరికి చల్లగా సాగుతున్న సంసారంలో, ఏదో అలజడి, ఏదో అశాంతి, అసంతృప్తి విలయతాండవం మొదలెట్టాయి.

"అమ్మాయీ! పిల్లాడు తూగుతున్నాడు..." ఎదటిబెర్త్‌మీద కూర్చున్న ముసిలిముత్తైదువ హెచ్చరికతో తుళ్ళిపడింది పార్వతి. గోపీగాడు నిద్రలోకి జారుకున్నాడు. వాణ్ణి సరిగా పడుకోబెట్టి తన పరధ్యానానికి తనను నిందించుకుంది పార్వతి. మనిషి మనసుకు ఉన్నంత వేగం మరిదేనికీ లేదు. ఒక్కగడియలో, భూతభవిష్యద్వర్తమానాలను గురించి ఒకయుగానికి సరిపడగల ఆలోచనలు మనసు చేస్తుంది! కూడని ఆలోచనలను గురించే మనసుకు కూరిమి ఎక్కువ. ట్రెయిన్ వేగం అధికమై, ముందుకు సాగుతున్నకొద్దీ పార్వతి ఆలోచనలన్నీ వెనక్కు, అంతకు పదిరెట్లు వేగంగా పరిగెత్తి, నెలరోజులక్రితం జరిగిన సంఘటనల మీదికి తీసుకువెళ్ళాయి ఆమెను.

* * *

సరిగ్గా నెలరోజులక్రితం ఆరోజు...సాయంత్రం......

"పారూ! పారూ! ఓ పార్వతీ దేవీ! ఎక్కడున్నావ్?"

విశ్వం హడావుడిగా లోపలకి వచ్చాడు. కిటికీ ఊచలు పట్టుకుని నిల్చుని వీధివేపు చూస్తున్న పార్వతి వినిపించుకోలేదు.

"దేవిగారేమిటో పరాకు చిత్తగిస్తున్నారు?" హుషారుగా వచ్చిన విశ్వం సరదాగా పార్వతిని తనవేపు తిప్పుకున్నాడు.

"అబ్బ! ఉండండి...అసలు మీ రెప్పుడొచ్చారు?" చిరాకుగా, అతని చేతులు దూరంగా తోసివేస్తూ అంది పార్వతి.

"అంతలా గావుకేకలు పెట్టుకుంటూ నే వచ్చినా గమనించలేని స్థితిలో వున్నావంటే...పోనీ అంత దీర్ఘాలోచ నేమిటో నాకూ కాస్త చెప్పకూడదూ?" చేతిలో ఉన్న గులాబీ పూవులు జడలో ఉంచబోయిన విశ్వానికి, పార్వతి విదిలింపుతో ఆశ్చర్యం ముంచుకొచ్చింది.

"ఈ సరసాలకేంగాని, కాఫీ త్రాగుదురుగాని వుండండి" విసురుగా లోపలికి వెళ్ళి ఫ్లాస్కు, గ్లాసు తెచ్చింది పార్వతి.

"పిల్లలేరి పార్వతీ?" భార్యవైపు నిశితంగా చూస్తూ అడిగాడు విశ్వం.

"అరుగో అంతా కూర్చుని వున్నారు ముంగులల్లే!"

"పార్వతీ! ఏమిటిదంతా? ఏమయింది నీకు? ఒంట్లో బాగాలేదా?" విశ్వం సహనం కోల్పోతూ మెల్లిగానే అడిగాడు.

"బాగానేవుంది." మరో ప్రశ్న కాస్కారం లేకుండా పెరట్లోకి వెళ్ళిపోయింది పార్వతి.

విశ్వం పక్కగదిలోకి వచ్చాడు. బిక్కు బిక్కు మంటూ మూల ఒదిగికూర్చొని పెద్దవాడుగోపీ భయంగా చూస్తున్నాడు. వాడు ఏడ్చాడన్నందుకు గుర్తుగా, కళ్ళువాచి, ముఖమంతా ఎర్రవారి వుంది. దుమ్ముకొట్టుకున్న లాగు, రేగిన జుట్టుతో దీనాతిదీనంగా వున్న వాణ్ణి చూస్తుంటే హృదయం కెలికినట్లయ్యింది విశ్వానికి.

"రా బాబూ! ఏమిటలా ఉన్నావ్? పాపేది? చేతులుచాచి సాదరంగా పిలిచాడు విశ్వం. అందాకా బిగబట్టుకూర్చునివున్న గోపీ ఒక్కసారిగా తండ్రి దగ్గరకు పరుగెత్తి బావురన్నాడు.

"ఊరుకో బాబూ! ఊరుకో...ఏమయింది? అమ్మ కొట్టిందా? ఎందుకని? పాపేది?"

వెక్కిళ్ళ మధ్యలో ఒక్కోమాటా గోపీ చెబుతుంటే, ఒళ్ళు మండిపోయింది విశ్వానికి.

"మట్టిలో ఆడుకొన్నానని అమ్మ నన్ను కొట్టింది నాన్నా! మట్టి తిన్నదని పాపను కూడా కొట్టింది. పాప ఏడ్చి ఏడ్చి పడుకుని నిద్రపోయింది..."

అంత చిన్న అల్లరికి ఇంత క్రితమెప్పుడూ పార్వతి, పిల్లల్ని అలా శిక్షించ లేదు...అందులోనూ రెండేళ్ళ పాపను కూడా ఎందుకొట్టింది? అంతకోపం రావాల్సిన అవసరమే మొచ్చిందీరోజు?

అసలు రోజూ ఆఫీసునుంచి తను ఇంటికొచ్చేసరికి కన్పించే దృశ్యం వేరు. పార్వతి తెల్ల వాయిల్ చీరె, నల్లని జాకెట్టు వేసుకుని. పాపను ముస్తాబుచేసి ఎత్తుకుని వీధి గుమ్మంలో నిల్చుని వుంటుంది. పార్వతి చీరెకుచ్చెళ్ళు పట్టుకుని ఏవేవో కబుర్లు చెబుతూ గోపీ శుభ్రమైన లాగు, చొక్కా వేసుకుని నిల్చుని వుంటాడు. తను సైకిల్ దిగటం తరువాయి, బాబు సైకిల్ బెల్ కొట్టడమూ, పాప తనమీదికి దూకడమూ, పార్వతి కిలకిల నవ్వటమూ ఒక్కసారిగా జరిగిపోతాయి. ఇల్లూ. ఇల్లాలూ, పిల్లలూ అలా కలకలలాడ్తుంటే, తనశరీర, మానసిక శ్రమనంతా ఒక్కక్షణంలో మర్చిపోతాడు!

కానీ ఈ రోజు అలాలేదు. వీధిగుమ్మంలో పార్వతి కన్పించలేదు. "బహుశా పని తెమిలివుండదు" అనుకున్నాడు విశ్వం లోపలికివస్తూ. పార్వతి చిరాకుచూచి తను కాస్త లేటుగా వచ్చినందుకు ప్రణయకోపం కాబోలు" అనిసమర్థించుకోబోయాడు. అలవాటు కొద్దీ దగ్గరకు తీసుకోబోయినా, జడలో పూవుంచబోయినా, విరసమే ఎదురయ్యింది. పైపెచ్చు పాప వేళగాని వేళలో అలసి నిద్రపోతోంది. గోపీ వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు ..

"అయ్యోరాత ! మీరింకా కాఫీ తాగలేదూ ? చల్లగా తగలడ్డాయి కూడాను !" పార్వతి మాటలకు వెనుదిరిగి చూచాడు విశ్వం.

"కాఫీ మాట తర్వాత. ముందిలా రా నువ్వు !"

విశ్వం అదలింపుతో పార్వతి కతనిదగ్గరకు రాక తప్ప లేదు.

"అసలేం జరిగిందీరోజు ? బాబునలా కొట్టావెందుకూ? నువ్వా అంత కోపంగా చిరాగ్గా వున్నావెందుకూ ?"

క్షణకాలం పార్వతి మౌనంగా వూరుకుంది. ఏమనుకుందో నేలవేపుచూస్తూ మెల్లిగా అంది... "పాడుపిల్లలు, యమ గోలచేస్తుంటే నాలుగు తగిలించాను. ఆమాత్రం హక్కు నాకు లేదంటారా ?" అందులోనూ కోపమే ధ్వనించింది గోపీని దించి "ఆడుకో బాబు !" అంటూ రెండు చాక్లెట్లు డబ్బా లోంచి తీసిచ్చాడు విశ్వం.

పసిపిల్లల హృదయం అమృతభాండం వంటిది. అల్ప సంతోషులు వాళ్ళు ! గోపీ నవ్వుతూ చాక్లెట్లు తీసుకుని బయటికి వెళ్ళిపోయాడు.

"సంజాయిషీ చెప్పానుగా ? ఇక వెళ్ళొచ్చా నేను ?" గిరుక్కున వెనుదిరిగి వెళ్ళబోతున్న పార్వతిని, చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు విశ్వం, వెళ్ళిపోనివ్వకుండా.

"హక్కులూ. సంజాయిషీల సంగతి కాదు నే మాట్లాడుతూంట... అసలేమిటి విశేషం అంటున్నాను !"

"ఏమీ లేదు...నన్ను విసిగించకండి!" చూస్తుండ గానే పార్వతి కళ్ళల్లో నీళ్ళు గిరగిర తిరిగాయి. విశ్వం ఆశ్చర్యపోయాడు.

పుట్టింటికి వెళ్ళి, తిరిగి తనతో బాటే బండెక్కే పార్వతి కళ్ళల్లో ఏనాడూ తను కన్నీటి చుక్క చూళ్ళేదు...పార్వతి అక్కచెల్లెళ్ళూ, తల్లీ కూడా వీడ్కోలు యిస్తూ కళ్ళనీళ్ళు ప్రేమాభిమానాలు వెల్లువలవుతుండగా, నింపుకుంటూంటే, పార్వతి చిరునవ్వుతో "వెళ్ళొస్తానమ్మా!" అంటూ చిరు నవ్వుతో చెప్పేది. అలాటి సమయాల్లో విశ్వం విస్మయంగా అడిగేవాడు. అదేమిటి పార్వతి? మీవాళ్ళంతా అలా కన్నీళ్ళు పెట్టుకుంటూంటే, నాకే ఎలాగో వుంది! కాని నీలో ఎలాటి వికారమూ కన్పించదు?"

పార్వతి నిండుగా నవ్వేది. కాళ్ళకు పచ్చగా పసుపు, కొత్తచీరె, తల నిండా మల్లెపూలు. నుదుట పెద్ద కుంకమబొట్టూ పాపిట్లో కుంకుమరేకతో పార్వతి అలా నవ్వితే, విశ్వాని కలాగే గంటల తరబడీ ఆమెకేసే చూడాలనిపిస్తుంది.

"నే నెక్కడికి వెళ్తున్నానని బెంగ పెట్టుకోవటం? నా భర్తతో బాటు నా స్వర్గానికి వెళ్తున్నాను ... ఈ కారణంగా అసలువాళ్ళు బెంగపెట్టుకోవటంలోనే అర్థం లేదు...వాళ్ళంటే కన్నమమకారం కొద్దీ కళ్ళు చెమర్చినా, అన్నీ తెలిసి నేనూ కన్నీళ్ళెట్టుకోవటంలో అర్థంముందంటారా!"విశ్వం నిరుత్తరుడై చూస్తుండిపోతాడు!

అలాటి పార్వతి ఈ రోజు ఏవిషయమై ఇంతగా బాధ పడ్తోంది?...కానీ ఇప్పుడప్పుడే కారణం చెప్పేలా లేదు పార్వతి.

ముందామె మనస్సు మరోవేపు మళ్ళించాలి. "పోన్లేనేస్తుకో! మంచి సినిమా వచ్చింది. ఇప్పుడు గంట ఆరు కావొస్తోంది... పిల్లన్ని ముస్తాబు చేసి నువ్వూ రెడీగా వుండు. రిక్షాపిల్చుకు వస్తాను...

జవాబు ఆశించకుండా వెళ్ళిపోయాడు విశ్వం.

విసుగుదలగానే ముస్తాబయింది పార్వతి. సినిమానుంచి ఇంటికి వచ్చిన పార్వతికి శాంతి కంటె అశాంతే ఎక్కువయింది.

ముభావంగా పార్వతిని అట్టే విసిగించటం మంచిది కాదనుకుని, తిన్నగా నిద్రలోకి జారాడు విశ్వం. పిల్లలిద్దరూ నిద్రపోతున్నారు. నిద్రకు దూరమైన ప్రాణి పార్వతి ఒక్కతే.

గదిలో ట్రాన్స్‌ఫారమ్ బల్బు వెలుగుతోంది. పాప పక్కన పడుకుని వున్న పార్వతికి పాప ఒళ్లు తన శరీరానికి తగిలినా చిరాకుగావుంది. మంచంమీద లేచికూర్చుని, చుట్టూ పరకాయించి చూచింది పార్వతి. చిన్నగది. భర్త నవారు మంచం, పక్కనే తనూ పాపా పడుకునే నులకమంచం. దాని పక్కనే గోపిగాడి చిన్న ఉయ్యాలలాటి పొట్టినవారుమంచం.. అమూలగా రెండు పెట్టెలు. నాసిరకం బల్ల. ఒకేఒక పేము కుర్చీ, మరో చిన్న చెక్కకుర్చీ! ఆ గదీ, గదిలోనిసామాన్లూ చూస్తున్నకొద్దీ మరీ అసహ్యం వేస్తోంది పార్వతికి. ఇదె తమ పడకగది! ఇదే ఉదయంపూట ఆయనగారి ఆఫీసు గది! ఈ గదిముందున్న ఒక అంకణం గది హాలు! ఈ రెండిటినీ ఆనుకునివున్న చిన్నగది వంటగది, భోజనాలగదీ కూడాను!

పేటన్నిటిముందూ చిన్న వరండా! ఇంతోటిబంగళాకు బాడుగ ముప్పై రూపాయలు !

అసలు ఇంత ఇరుగ్గావున్న ఇంట్లో నాలుగేళ్ళకు పైగా తాము వుంటున్నా యేనాడూ, యింత బాధనిపించ లేదు ! ఆ ఏళ్ళుగా పరిచయమున్న ఈ వస్తుసముదాయమూ, తనకు అసహ్యంగా, గలీజుగా తోచ లేదు. కానీ. ఈరోజెందుకీ వాతావరణం తన కింత దుర్భరంగా వుంది ?...

తన ప్రయత్నం లేకుండానే పార్వతి ఆలోచనలన్నీ, ఆ రోజు ఉదయం పదిగంటలు దాటింతర్వాత జరిగిన సంఘటన మీద కేంద్రీకరింప బడ్డాయి... అందాకా చీకూ చింతా తెలియని ఆమె హృదయం ఆతర్వాత ఇలా కల్లోలమై పోయింది.

తొమ్మిదిన్నరకల్లా భోజనంచేసి సైకిలు వరండాలోకి తెచ్చాడు విశ్వం. పిల్లలిద్దరికీ చేతూలూ, మూతులూ కడిగి, తనూ వరండాలోకి వచ్చింది. పార్వతి.

“కాసేపు కూర్చుని విశ్రాంతి తీసుకుని సైకిలెక్కండి. అసలే ఎండాకాలం ! దానికితోడు వేడివేడిఅన్నం తిని వెంటనే ఆఫీసుకు పరిగెత్తితే ఆరోగ్యం పాడవదూ !” భుక్తాయాసంతోనే, సైకిల్ చెయిన్ సరిగా వుందోలేదో సరిచూచుకుంటున్న భర్తవేపు జాలిగాచూస్తూ అంది పార్వతి.

విశ్వం చిన్నగా నవ్వాడు... “కూర్చోవటమూ, విశ్రాంతి తీసుకోవటమూ అనేవి మన జీవితాల్లోనే లేవీనాడు! నేను చేస్తున్నది గుమాస్తా ఉద్యోగం దేవీ ! ఆఫీసరు హోదాలో

అరగంట ఆలస్యంగా ఆఫీసుకెడితే, అక్కడ ఆఫీసరుగారి హిత బోధలూ చివాట్లూ వినలేక చచ్చిపోవాలి!"

"ఆ! రోజూ లేటుగా వెడుతున్నారా ఏమిటీ? ఎప్పుడో ఒకనాడు కాస్త... పార్వతి మాటమధ్యలో వుండ గానే అందుకున్నాడు విశ్వం.

"ఆ ఒకనాడే గుర్తు పెట్టుకుంటాడు ఆఫీసరు... సర్లే! ఇలా భార్యతో బాతాఖానీ వేసుకూర్చుంటే, భుక్తి గడచే దెలా?" నవ్వుతూ సైకిల్ మీద కాలుంచాడు విశ్వం.

"టాటా నాన్నా!" గోపీ అరిచాడు.

"టా! టా!"

పాప మాటలు లేకుండా చెయ్యూపుతూ సైగ చేసింది!

సైకిలు వీధిమలుపు తిరిగేవరకూ చూస్తుండి, పిల్లలతో లోపలికి వెళ్ళింది పార్వతి. వంటిల్లు శుభ్రం చేసుకవచ్చి, హాలులో అడుగుపెట్టిన. పార్వతికి ముందు కనిపించినవి మాసిన బట్టలు! స్టాండుకు తగిలించివున్న రెండు పైజమాలు, రెండు లాల్చీలు నీరుకావిబట్టి వున్నాయి. పిల్లలిద్దరి బట్టలూ మురికిగా వున్నాయి.

"ఒరేగోపీ! నీ లాగూ కూడా బాగా మాసిపోయింది బాబూ! తెల్లగా వుతుకుతాను... ఈ లంగోటీ వేసుకో! చెమట పట్టకుండా చక్కగా వుంటుంది!"

ఆట్టే మారాం చెయ్యకుండా అమ్మ చెప్పినట్లు విన్నాడు గోపీ! ఇంకా వాడికి మరో రెండు జతల ఇస్త్రీ బట్ట లున్నాయి. అవి అలా వుంచేసి ఎక్కడికైనా వెళ్లేటప్పుడు వెయ్యొచ్చు... ఈరోజీ బట్టలన్నీ శుభ్రంగా ఉతికి, ఆరవేసి రేపు ఇస్త్రీ పెట్టొచ్చు...

పిల్లలిద్దరి ముందూ లక్కపిడతలు వేసి, వీధివాకిలి వారగా వేసి, పెరట్లోకి వెళ్ళింది పార్వతి మాసిన బట్టలతో...

అన్ని బట్టలకూ సబ్బు పట్టించటం పూర్తికావొచ్చింది. ఇంక రెండు జాకెట్లు మాత్రం వున్నాయి తనవి! సబ్బు నురగ చిందుతుందని, రంగుపోయిన పాత చీరె, జాకెట్టూ వేసుకుంది పార్వతి. ఒంటినిండా అక్కడక్కడా సబ్బునురగ చింది పడింది బట్టలు ఉప్పళించటంలో!

వీధివాకిటి దగ్గర కారాగిన చప్పుడూ హారన్ మోతా రెండూ వినిపించాయి.

“మా యిల్లు వెతుకుంటూ కారులో వచ్చేవాళ్లెవరు న్నారు? పుట్టింటివేపు గానీ, మెట్టింటివేపుగానీ అంతగా పెట్టి పుట్టినవాళ్లెవరూ లేరే! బహుశా యెదురుగా వుండే ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసు కెవరో డబ్బుగలవాళ్ళొచ్చుంటారు కార్లో!” అనుకుంది పార్వతి జాకెట్టు నీళ్ళలో వేసి తడుపుతూ.

“ఏమండీ! లోపలెవరు.?”

ఎవరిదో సన్నని ఆడగొంతు తలుపు దగ్గరగా వినిపించి త్రుళ్లిపడింది పార్వతి. గబగబ చేతులు బక్కెట్లో ముంచి, పమిటె కొంగుతో తుడుచుకుంటూ పరుగెత్తుక వచ్చింది.

ఆసరికే ఆ వచ్చినావిడ తలుపు తోసేసుక లోపలికి వస్తోంది!

నిశ్చేష్టురాలై నిల్చుంది పార్వతి! ఒక నిమిషంపాటు గుర్తుకురాలేదు ఆవిడెవరో! మరునిముషంలో పోల్చుకుంది...

"అదేమిటోయ్ పార్వతీ! అలా దెయ్యాన్ని చూసినట్లు చూస్తున్నావ్ నన్ను? గుర్తుకురాలేదా ఏమిటీ? నేను నీ క్లాస్‌మేటు సరోజని!" నవ్వుతూ, జారిపోతున్న టెరిలిన్ చీరె సర్దుకుంటూ అంది సరోజ.

పార్వతికి అగాధాల్లో పడిపోతున్నట్లనిపించింది... దూరంగా కారు దగ్గర నిల్చుని డ్రైవర్ కాబోలు వింతగా చూస్తున్నాడు...కారులో నుంచి ఆరేళ్ళబాబు "అమ్మా! నేనూ దిగిరానా?" అంటున్నాడు.

"షాపింగ్‌కని వచ్చాను. షాపులో మన క్లాస్‌మేటు నీరజ కన్పించింది...అదిక్కడ ఏదో ఆఫీసులో టైపిస్టుగా పనిచేస్తోందటగా! నువ్విక్కడే. ఈ వీధిలోనే వున్నావని నీ అడ్రస్ చెప్పింది...పనిలోపని...చూచిపోదామనిపించింది... రారా! బాబూ! దిగిరా!"

పార్వతిని ఆపాదమస్తకం పరికిస్తూ వివరాలు చెప్పి, హుందాగా బాబుకు అనుమతిచ్చింది సరోజ.

అప్పటికి కొద్దిగా తేరుకొన్న పార్వతి గబగబ కుర్చీ తేవటానికి పక్క గదిలోకి వెళ్లింది...కానీ కుర్చీలు రెండూ ఉండవలసిన స్థానాల్లో లేవు! పేము కుర్చీ తలక్రిందుగా పడి

వుంది...దాని చాటుగా లక్కపిడతలూ, మట్టీ, చిల్ల పెంకులూ, అమర్చాడు బాబు ! ఉక్కగావుందని గౌను విప్పిన పాప, ఆ మట్టంతా అలుకుతోంది కోయ్యకుర్చీలో పోసి !

"అయ్యో ! ఏమిటీపని బాబూ ! పాపా ! ఉండు సరోజా, చాపైనా వేస్తాను...మా పిల్లలెలా పాడుచేశారో కుర్చీలు !" గాభరా అనుచుకుంటూ మూలకు పరుగెత్తి చాప తెచ్చి పరిచింది పార్వతి.

సరోజ కొడుకు అందమైన రెడీమేడ్ దుస్తుల్లో, బొమ్మల సాక్స్. బొమ్మల బూట్లు తొడుక్కుని ముద్దుగా కూర్చు న్నాడు తల్లిపక్కనే !

"అబ్బబ్బ! ఉడికిపోతోంది పార్వతీ! ఫాన్ లేదా ? పోన్లే ఓ విసనకర్ర ఇవ్వు చాలు !" సరోజ ఊపిరిసలపనంతగా బాధ పడ్తూ పమిటకొంగుతో విసురుకొంటోంది.

పిల్లల ఆటవస్తువుల్లో కొత్తవిసనకర్రకూడా భాగస్వామి అవటంవల్ల. పాప మట్టితో కడిగేసింది దాన్ని ! అలా గేదుమ్ము దులిపి తెచ్చింది పార్వతి.

"నువ్వూ కూర్చో పార్వతీ !" సరోజ గొంతులో ఆజ్ఞా పిస్తూన్న ధ్వని మాత్రమే వినిపించింది పార్వతికి.

చాపమీద కూర్చుంటూ "పెద్దొక్కడేనా పిల్లవాడు ?" అంది పార్వతి, బాబు బుగ్గలు నిముగుతూ !

"ఆఁ, వీడొక్కడే ! నీకో ?"

"ఇద్దరు! ఆ గదిలో ఆడుకుంటున్నారు."

"ఏరీ?"

"చూపిస్తా! అయినా ఎన్నాళ్ళకు కలుసుకున్నాం సరోజా మనం? అప్పుడు నేను మావూరి కొచ్చినప్పుడు మీ వారు ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేసి, వ్యాపారం పెట్టాగని చెప్పారు మా అమ్మావాళ్లు...అంతే తర్వాత నువ్వూనేనూ కలుసుకోనే లేదుకదా?" పార్వతి ఆప్యాయంగా అంది.

"అవును... అయినా వెధవ్వుద్యోగాలులే పార్వతీ! గొర్రెతోక ఆదాయాలు! మావారు అప్పుడు హెల్త్ ఆఫీసరుగా వుండేవారా? అస్తమానూ కాంపులు! అదేమంటే టి, ఏ. లు ఇస్తున్నాం అంటుంది గవర్నమెంటు! ఆ టి.ఏ.లూ ఆ జీతాలూ ఏమూలకొస్తాయి మనకు? అందుకనే శుభ్రంగా రాజీనామా ఇచ్చేశారు! వ్యాపారంలోకి దిగారు! అంతే. లక్షలు గడించారనుకో! ఈ వెధవ్వుద్యోగా లన్నా వుద్యోగస్తులన్నా నాకు పరమ చిరాకు!"

గతుక్కుమంది పార్వతి.

"ఈ మధ్యనే ఈ వూళ్లో ఓ బంగళా కొన్నాం! అన్ని సౌకర్యాలున్న ప్రదేశమిది. అందుకే ఇక్కడే బిజినెస్ హెడ్ క్వార్టర్సుగా చేస్సేశాం!"

సరోజ నవ్వుతూంటే, చెవులకున్న రవ్వల దుద్దులు, ఆ మెతల విదిలించి నప్పుడల్లా వింత వింతరంగులు ప్రతిఫలింప చేస్తున్నాయి. మెడలోని వజ్రాలహారంవంక వింతగాచూచింది పార్వతి.

"ఇదా ? ఈ మధ్యనే నా పుట్టినరోజు పండుగకు బహు మతిగా అసలైన జాతివజ్రాలు పొదిగించి మరీ చేయించారు మా వారు !" పార్వతి మనసులోని వూహ పసికట్టినట్లు చెప్పి కిలకిలనవ్వింది సరోజ, సిగలో అమర్చుకున్న ముత్యాల మువ్వలు కదిలేలా !

"అన్నట్లు నీఅవతారమేమిటిలావుంది ?" కళ్ళుచిట్లించి తమాషాగాచూస్తూ అంది సరోజ !

అప్పుడుగానీ తన బట్టలూ, తన అవతారాన్ని గురించీ గుర్తుకురాలేదు పార్వతికి ! కుంచించుకు పోయింది క్షణకాలం

"...పిల్లల బట్టలకు సబ్బు పెడుతూ......" నసిగింది పార్వతి. ఆగర్భ శ్రీమంతురాలైన సరోజ తనను చూచి ఏమనుకొంటోందో ?

"వ్వాట్ ! పిల్లల బట్టలకు నువ్వే సబ్బు పెడతావా ? మీవారివీ, నీ బట్టలూ కూడా స్వతంగా ఉతుకుతావా?" అదేదో వినగూడనిమాట విన్నట్లు త్రుళ్ళిపడింది సరోజ...

"ఊఁ" ఏమనాలో తోచలేదు పార్వతికి.

"ఏదీ మీ ఇల్లు చూపించు ! పార్వతీ మీ పిల్లలేనా కనిపించలేదు..." సరోజ ఏకంగా లేచింది.

పార్వతికెలాగో వుంది...ఈలోగా, గోపీ పరుగెత్తుక వచ్చి ఒళ్ళో దూకాడు...

"వీడు నీ పెద్దవాడా ?"

మట్టిపూసుకుని, ఆటలో అలసి, ఒళ్ళంతా చెమట పట్టి, లంగోటీ జారిపోతూంటే ఎగదోసుకుంటున్న గోపీని నిశితంగా చూస్తూ, అడిగింది సరోజ !

"ఆఁ"

"ఫర్వాలేదు! అంతా నీపోలికే! మట్టిలో మాణిక్యంలా వెలిగిపోతున్నాడు. పాపేదీ ?"

పార్వతి గోపీని వదిలించుకుని గదిలోకి దారితీసింది. ఆడి ఆడి అలసిపోయి తలక్రిందులుగా వున్న కుర్చీలమధ్య బోర్లా నేలమీదే పడుకుని నిద్రపోతోంది పాప !

"ఏమిటి పార్వతీ! పిల్లల కిలా నేలమీద పొర్లాడటం అలవాటుచేశావ్ ? రేపు పెద్దవాళ్ళయినా ఈ దురలవాటు మానరు ! అదేదో పద్యంలోలా "కనకపు సింహాసనమున" అన్నట్లు తయారవుతారు !"

పార్వతి కేం సమాధానం చెప్పాలో తోచలేదుగానీ, సరోజ విసిరిన వ్యంగ్యానికి అవమానంతో కుతకుతలాడి పోయింది, పాపనెత్తి, చిన్నమంచం వాల్చి, బొంత పరచి పడుకోబెట్టింది.

"ఇది స్టోర్ రూమా ?" అంది సరోజ గది నలు వేపులా పరకాయించి చూస్తూ.

"ఊహుఁ, మేమిక్కడ పడుకుంటాం!" అంది పార్వతి.

"ఇక్కడా ? అంటే ఇది బెడ్ రూమ్ అన్నమాట ! మరి ఈ టేబిల్, కుర్చీలూ ?" ఆశ్చర్యంగా అడిగింది సరోజ.

''మావారు ఆఫీసుకాగితాలు వ్రాసుకుంటారు !''

సరోజ కిలకిల నవ్వింది ! ''ఓ ! ఆఫీస్ రూం కంమ్ బెడ్ రూం అన్నమాట ! మరి మీ డైనింగ్ హాల్ ఏదీ ?''

''డైనింగ్ హాలంటూ ప్రత్యేకంగా ఏమీ లేదు. మనం ఇందాక కూర్చున్న గదినే మేము హాలనీ, ముందరిల్లనీ, నడవనీ అంటుంటాం !'' అసహనంగా జవాబిచ్చి వంట గదిలోకి దారితీసింది పార్వతి.

''అమ్మయ్యో ! ఇదా వంటిల్లూ ప్లస్ భోజనాలగదీ? మా బాత్ రూం దీనికంటే మూడు రెట్లు పెద్దది ... పాత్రలు కూడా కొద్దిగానే ఉన్నాయల్లే వుంది ! అందుకే ఇక్కడే అన్నీ అమర్చగలిగావు !''

''పైప్ సిస్టమ్‌లేదా ఈ వీధికి ! నూతిలో నీళ్ళుకూడా చాలా లోతుగా వున్నాయి !'' నూతిలోకి తొంగిచూస్తూ అంది సరోజ.

''ఇంకా పైప్స్ వేయించలేదీ వీధికి !'' పొడిగా అనేసింది పార్వతి.

''పనిమనిషి తోడిస్తుందా నీళ్ళు...లేక నువ్వే తోడుకుంటావా నూతిలోంచీ !'' కుతూహలంగా అడిగింది సరోజ.

''పాచిపని, అంట్లు తోమినందుకే పనిమనిషికి ఐదు రూపాయలు ఇస్తున్నాం! అది వున్న రెండుగంటల్లో కావలసిన నీళ్ళు తోడించుకుంటాను. అది వెళ్ళాక నీళ్లు అవసరమైనప్పుడల్లా నేనే చేదుకుంటాను. అప్పుడప్పుడూ నాకు సాయం

వారూ తోడిస్తారు ?" అమాయకంగా అన్న 'పార్వతి వెంటనే నాలుక్కొర్చుకుంది !

"ఏమిటే ! మీవారుకూడా నీలానే ఈ పనులన్నీ స్వయంగా చేసుకుంటారా ఏమిటి ?" విస్మయంగా చూస్తూ అడిగింది సరోజ.

పార్వతి పలకలేదు.

"ఇందాక నువ్వు సబ్బు పెట్టిన బట్టలా ఇవి ? ఇన్ని బట్టలకు సబ్బు పెట్టేసరికి నీ చేతులెలా వున్నాయో గానీ, నా చేతులయితే విరిగిపోయుండేవి !"

పార్వతి పలకలేదు. ఇద్దరూ మళ్ళీ హాల్లోకి వచ్చి చాపమీద కూర్చున్నారు. అందాకా అక్కడే భాసింపట్టు వేసుకూర్చున్న సరోజ కొడుకు "అమ్మా ! ఇంక వెళ్దా మమ్మా ఇంటికి ?" అన్నాడు నసుగుతూ.

"అయ్యో ! యీ పూటే తమలపాకులూ అయిపో యాయి...పండ్లూ ఏమీ లేవు !" పార్వతి నొచ్చుకుంటూ గొణుక్కుంది.

"మరేం ఫర్వాలేదులే ! పండ్లకోసం, తాంబూలాల కోసం రాలేదు. నిన్ను ఒక్కసారి చూచి, పిల్చివెళ్దామని వచ్చాను..." అంది సరోజ.

"అదేమిటి ? నన్నెక్కడికి పిల్చికేళ్ళేది? ఆశ్చర్యంగా అడిగింది పార్వతి.

"మా యింటికి !

"ఇప్పు డెందుకులే సరోజా ? మరోసారి వీలుచూచుక వస్తాను..."

"భలేదానివే ! ఓ పెద్ద బట్టలబేల్ షాపుకు డ్రైవర్ చేత మా యింటికి పంపించి నే నిలా వచ్చాను నీ కోసం ! అసలు నీరజ నీ విషయం చెప్పటంతోటే ప్రాణాలు లేచివచ్చాయి. అచ్చం నేనొక్కర్తెనే చీరెల సెలక్షన్ కు తలపడ్డానంటే ఏ రంగూ నాకంటికి నచ్చదు ! మరొకరు 'ఈ రంగు నీ ఒంటికి బావుంటుందీ' అంటే చాలు నచ్చితీరుతుంది. మనం చదువు కునే రోజుల్లో నీకు గుర్తు లేదూ ? ఎప్పుడు నేను బట్టలు కావా లన్నా నిన్ను మా యింటికి పిల్చికెళ్లేదాన్ని !" అనర్గళంగా చెప్పేస్తోంది సరోజ.

"అదంతా సరే సరోజా ! ఉన్నపళాన నన్ను రమ్మంటే ఎలా చెప్పు? టైం మూడు కావొస్తోంది. ఇక రెండున్నర గంటలకల్లా మావారొస్తారు ! ఈలోగా వంటా-వార్పూ, పనీ బోలెడంత వుంది...అదీగాక వారొచ్చేసరికి యిల్లు తాళంవేసి ఎటో వెళ్లే ఆచారమూ నాకు లేదు...

పార్వతి మాటలకు అడ్డొచ్చింది సరోజ...

"ఈ సాకులన్నీ నాకు చెప్పకు ! వంటావార్పూ, పన్లూ నీకు రోజూ ఉండేవేగా ? ఇంటికొచ్చాకా చేసుకోవచ్చులే యీ రాచకార్యాలు ! మీ వారొచ్చేలోగా మా కారులో నిన్ను పువ్వుల్లో పెట్టి,మీఇంట్లో చేర్చే పూచీ నాది, సరా?"

"పాప నిద్రపోతుంది...ఇప్పుడెందుకు..."

"నువ్వు ముందు బట్టలు మార్చుకొని బయల్దేరుతావా? ఇలాగే లాక్కెళ్ళి కార్లో పడేయ్యనా?"

జబర్దస్తీ అంటున్న సరోజలో క్షణంసేపు చిన్నప్పుడు, చనువుగా వుండే సరోజ కన్పించింది పార్వతికి.

పార్వతికిక తప్పలేదు. గబగబ బట్టలు మార్చింది. పాపకు అలాగే గౌను వేసి బొట్టు, కాటుక పెట్టింది. ఇంటికి తాళంవేసి సరోజ పక్కన కార్లో కూర్చుంది.

కారు వెళ్తుంటే గోపీ సంతోషంతో చప్పట్లు చరుస్తూన్నాడు...

"ఏరా? కార్లో వెడుతూంటే అంత సరదాగా వుందా నీకు! మా వాడు చూడు పార్వతీ! విమానంలో కూలేసినా, తొణకడు, బెణకడు!" సరోజ సరదాగానే అంటోందో లేక గోపీని వ్యంగ్యంగా విమర్శిస్తోందో, అదీగాకుంటే తన బాబు గొప్పతనాన్ని గురించి చెప్పుకొంటోందో కూడా అర్థంగా లేదు.

గేటుదగ్గరున్న గూర్ఖా సవినయంగా గేటు తెరిచాడు. కారు దూసుకు వెళ్ళి బంగాళాముందు ఆగింది.

"చాలా త్వరగా వచ్చేసాం!" అంది పార్వతి. బ్రహ్మాండంగావున్న బంగళానూ, అందంగావున్న పరిసరాలనూ పరికించి చూస్తూ.

"అవునోయ్ పార్వతీదేవీ! కార్లోకాబట్టి ఇంత త్వరగా వచ్చేసాం! అదే రిక్షాలోనో అయితే గంటంబావుకు తక్కువ పట్టేది కాదు...

లోపలికి దారితీసింది సరోజ అనుసరించింది పార్వతి.

రంగురంగుల షేడ్స్ వచ్చేలా గోడలంతా ఎనామిల్ పెయింటింగ్స్. మొజయిక్ ఫ్లోర్! గాలికి రెపరెపలాడుతున్న సన్నని సిల్కు తెరలు! వరండాదాటి హాల్లో అడుగెట్టి విస్మయాన్నెలాగో అణచుకుంది పార్వతి. తమ ఇంటికి షుమారు మూడురెట్లున్న హాలు! కుడిచేతి వైపు మూలగా రేడియో గ్రామ్! హాలుమధ్యలో కుషన్ సోఫాసెట్టు; పైన గిరగిర తిరుగుతున్న సీలింగ్ వైట్ ఫాన్.

"కూర్చో పార్వతీ!"

సోఫాలో కూర్చుని ఒళ్ళో పాపనూ, పక్కన బాబునూ కూర్చోబెట్టుకుంది పార్వతి.

"ఇదో రామూ! నాలుగుగ్లాసులు ఐస్ వాటర్ ముందు తీసుకురా!" ఆజ్ఞాపించింది సరోజ.

"ఇప్పుడవన్నీ ఎందుకు సరోజా? నే వెళ్ళాలి త్వరగా!" మనసులో "హఠాత్తుగా ఏకారణం చేతైనా ఆఫీసు త్వరగా వదిలి వారొస్తే?" అనే అనుమానం, భయమూ పీడిస్తున్నాయి పార్వతిని, ఇంతక్రిత మెప్పుడూ తనిలా ఆయనతో చెప్పకుండా ఎక్కడికీ వెళ్ళలేదు కూడాను.

"మా ఇంట్లో మంచినీళ్ళుకూడా తాగవా ఏమిటి? నే నొదిలిపెట్టను...మా ఇంటి గడప దాటి మా కార్లో కూర్చునే వరకే నీ ఇష్టం! ఆ తర్వాత నా ఇష్టం!" అంది సరోజ నవ్వుతూ.

రాము ట్రేలో నాలుగు గ్లాసులు ఐస్ వాటర్ తెచ్చాడు. మెల్లిగా అతడితో ఏదో చెప్పింది సరోజ. మరో ఐదు నిముషాల్లో మరో ట్రేలో వెండి ప్లేట్లలో స్వీటూ, హాటూ తెచ్చాడు.

"సరోజా ! ఇలాగే మింగబెడ్తూ కూర్చోపెట్టుకుంటావా ?" పార్వతికి నిజంగానే కాస్త కోపం వచ్చింది.

"టిఫన్ తీసుకో ముందు...తర్వాత ఇల్లంతా చూపిస్తాను...ఆ తర్వాత చీరెలు నీముందు పడేస్తాను ... నాలుగు ఎన్నికచెయ్యి. మరుక్షణం నిన్ను కాల్లో తరిమేస్తాను.సరా?" సరదాగా అంది సరోజ.

"ఇది డ్రాయింగ్ రూం ! నాకు గానీ మా వారికిగానీ అత్యంత సన్నిహితులయిన ఫ్రెండ్సుగానీ, బంధువులుగానీ వస్తే ఈ గదిలో కూర్చోబెడతాం." హాలుకు ఒకవైపు చివరవున్న గదిలోకి పిల్చుకెళ్ళి చెప్పింది సరోజ.

పెద్ద రూం, రెండు సోఫాలూ, చిన్నటీపాయ్. ఫ్లవర్ వాజ్! ఎర్రని రంగుల రంగుల తివాచీ పరచివుంది మెత్తని నేలమీద.

"ఒహో!' అంది పార్వతి...

"ఇది గెస్ట్‌రూం !" ముఖపరిచయం మాత్రమే వున్నవారూ, అంత ముఖ్యం కానివారూ వస్తే ఇక్కడ కాస్సేపు వుండి పనిచూచుక వెడతారు." సింపుల్‌గా రెండు సోఫాలు మాత్రం వున్నాయి. పాలగచ్చు వెండిలా మెరుస్తోంది.

"ఇది డ్రెస్సింగ్ రూం!" హాలుకు మరోవైపున్న ఓ గదిని చూపింది సరోజ... పెద్దగది. గదిలో మూలగా మూడు రోజ్‌వుడ్ బీరువాలు అద్దాలు ఫిటప్‌చేసి వున్నాయి. మరో వేపు డ్రెస్సింగ్ టేబిల్, పెద్ద టేబిల్ మిర్రర్, టేబిల్ మీద రక రకాల హెయిర్ ఆయిల్సూ పౌడర్సూ వున్నాయి.

"ఇది మా వారి బట్టల బీరువా! మరొకటి మేడమీద వుంది. ఇది నా బీరువా...ఇది మా బాబుది. మా ఇద్దరిక్కూడా మేడ మీద మరో రెండు బీరువా లున్నాయి..."

తాళంతీసి ఒక్కో బీరువా చూపుతూ చెప్పింది సరోజ

పార్వతికి కళ్ళు చెదిరినట్లయింది! రంగురంగుల చీరెలు! రకరకాల జాకెట్లు! ఎన్నో రకాల రెడిమేడ్ నిక్కర్లు, చొక్కాలు! అన్నీ ఒక్కోటి యాభై రూపాయలపైనా, నూరూ, రెండు వందలూ లోపల ఖరీదు గలవిగా వున్నాయి...

"ఇది మా వారి రూం. ఇక్కడే వారు వ్యాపార సంబంధమైన కాగితాలూ అవీ వ్రాసుకుంటారు...

పెద్ద గాడ్రేజ్ బీరువా... టేబిల్ ఫ్యాన్. గ్రాడేజ్ టేబిల్, రివాల్వింగ్ ఛేర్సు సీలింగ్ ఫాన్, టెలిఫోన్... పెద్ద ఆఫీసును గుర్తుకు తెస్తోందా గది.

"ఇది డైనింగ్ హాలు..." పెద్దపెద్ద టేబిల్సు రెండూ, చుట్టూరా ఆరు గాడ్రేజ్ కుర్చీలూ అద్దంలా మెరుస్తున్న గచ్చూ చూస్తుంటే దిగ్భ్రాంతి చెందినట్లయ్యింది పార్వతి.

మేడ చూద్దూగాని, రా!"

"ఇప్పుడెందుకులే !"

వినిపించుకోకుండా మేడమీదకు లాక్కెళ్ళింది సరోజ.

"ఇది మా బెడ్ రూం." పెద్దపెద్ద కుషన్ పరుపులూ, డన్లప్ తలగడలూ, చక్కటి చాంద్రమంచాలు రెండూ, చుట్టూరా దోమతెరలూ !

నీడలు పడ్తున్న నేల !

"ఇది మరో డ్రెస్సింగ్ రూం. దీన్లోనుంచి బాత్ రూం, లావెట్రీ కూడా వున్నాయి అటువేపు...ఇది బాల్కనీ !" ఆర్చీలకు అల్లుకుని మేడ పైభాగం వరకూ ఎగ్రపాకిన ఎరని నక్షత్ర పూలతీవె అందంగా విరగబూసివుంది.

అసూయలాంటి భావమేదో పార్వతి హృదయంలో పొడసూపి అది క్రమంగా పెరిగి పెద్దదై కొండంతైకూర్చుంది.

"ఈ బంగళాకు బాడుగెంతిస్తారు సరోజా !" కుతూహలం పట్టలేక అడిగింది పార్వతి.

సరోజ పకపక నవ్వింది...

"బాడుగ బంగళా కాదోయ్ ! కొన్నాం. లక్షా చిల్లరైందనుకుంటాను!" గొప్పగా చెబుతూ మెట్లు దిగింది సరోజ.

"సరోజా ! ఇక వెళ్తాను. ఐదు కావోస్తోంది ! అంత బంగళాలో సరోజ పక్కన తను నిల్చుంటే ఏదో చిన్న పురుగులా వున్నానన్న భావం పార్వతిలో రాజ్యంచేస్తోంది.

"ఇవిగో యీ చీరెలు సెలెక్టు చెయ్యి. పంపించేస్తాను." నౌకరుచేత బేల్ విప్పదీయించి, చీరెలన్నీ ముందు పడే యించింది సరోజ.

కళ్ళు చెదిరిపోయాయి పార్వతికి. వింతవింత రంగులూ, కొత్త కొత్త రకాల సిల్కులు...సరిగా వాటిపేర్లేవో కూడా తనకు తెలీవు!

నాలుగు సెలెక్టు చేసింది పార్వతి.

"బెస్టుగా వున్నాయి...అవినాలుగూ తీసుకుంటాను... బహుశా ఆరువందలు కావొచ్చు."

పది నిముషాలలో ఓ బుట్టనిండా అరటిపళ్ళు, కమ లాలు, యాపిల్స పెట్టి తాంబూలం ఇచ్చింది సరోజ...

"శ్రావణ శుక్రవారం నోమునాడు కబురంపిస్తాను; తప్పక రావాలి సుమా!" అంది సరోజ

కారులో వస్తుంటే పార్వతి మనస్సంతా వికలమై పోయింది. తనతోబాటు స్కూల్ ఫైనల్ వరకూ చదువుకున్న సరోజ... హైస్కూల్ మాష్టరుగారమ్మాయి సరోజ... గంపెడు పిల్లలతో ఏ ముద్దూ ముచ్చటా తీరకుండా పెరిగిన సరోజ...ఎంత అదృష్టవంతురాలు! ఎంత ఐశ్వర్యంతో మునిగి తేలుతోంది! సరోజ పెళ్ళయిన కొత్తలో, ఆమె భర్త చిన్న ఉద్యోగమే చేస్తుండేవాడు ... ఇప్పుడు.. లక్షలతో ఆడుకుంటున్నారిద్దరూ. తనకంత అదృష్టమేదీ ఈ బంగళాతో పోల్చుకుంటే తమ ఇల్లు చిన్న బొమ్మరిల్లులా

వుంది. సరోజ అన్నట్లుగానే తమ ఇల్లంతా కలిసి సరోజా వాళ్ళ బాత్ రూమంత లేదు ! నూటయాభై రూపాయలు సంపాదించే విశ్వం జీతంలో మార్పులేదు, జీవితంలో కూడా మార్పురాదు ! తనకూ అంత అదృష్టం పడితే ? ఆ భావన రాగనే సంతోషంతో తేలిపోబోయిన ఆమె హృదయం క్షణంలో వాస్తవిక పరిస్థితిని గుర్తించి క్రుంగిపోయింది.

కారులోనుంచి దిగి ఇంట్లో అడుగెట్టిన పార్వతికి తన తక్కువతనం మరింత విశాలంగా కనిపిస్తోంది. ఇన్నేళ్ళుగా వున్న ఈ ఇల్లు ఇరుకుగా, అసహ్యంగా దుర్భరంగా తోస్తోంది.

పిల్లలిద్దర్నీ గదిలో వదలి, కుంపటి వెలిగిస్తూంటే, మళ్ళీ ఆలోచనలు ఈగల్లా ముసురుకున్నాయి. తనూ సరోజ అంతటి అదృష్టవంతురాలు ఏనాటికేనా కాగలుగుతుందా ?

పెద్దగా గోపీ ఏడవటంతో, ఉలిక్కిపడి వరండాలోకి పరుగెత్తింది పార్వతి. చెంబుతో నీళ్ళుపోసి మట్టిపిసికి బుర్దు చేస్తున్న గోపీని పాప నెట్టింది. ఆ బురదలో బోర్లాపడ్డాడు వాడు. చొక్కా చెడ్డీ దుమ్ముకొట్టుకున్నాయి. పాప మన్ను తింటోంది; సరోజ ప్రక్కన తను నిల్చుని వున్నప్పటి దృశ్యాలూ, కలగా పులగంగా వూహించుకుంటున్న వూహాలు చెల్లా చెదరయ్యాయి. ఆ విసుగులో పిల్లలిద్దర్నీ, చెరో నాలుగూ తగిలించింది పార్వతి.

"పార్వతీ ! ఇంకా నిద్రపోలేదూ ?" అంటున్న భర్త మాటలతో. సాయంత్రం జరిగిన సంఘటనల తాలూకు దృశ్యాలకు స్వస్తిచెప్పి, నిద్రకుపక్రమించింది పార్వతి.

శ్రావణ శుక్రవారం ఇల్లంతా కడిగి, ముగ్గులు పెట్టింది పార్వతి. తలంటుస్నానంచేసి నోమునోచుకొంది. కాళ్ళకు పసుపుతో, వదులుగా వేసుకున్న జుట్టుముడితో, నుదుటకుంకుమ బొట్టుతో. కొత్త నేతచీరెలో అందంగావుంది పార్వతి. పిల్లలిద్దర్నీ ముస్తాబుచేసింది పార్వతి.

హఠాత్తుగా వాకిలిముందు కారు ఆగింది. టెరిలిన్ చీరె రెపరెపలాడించుకుంటూ, మెడలో వజ్రాలహారం ధగ ధగ మెరుస్తుంటే, గబగబా వస్తోంది సరోజ!

"కూర్చో సరోజా!" అంది పార్వతి చాపవేస్తూ.

"కూర్చోవటానికి టైం లేదోయ్ పార్వతీ! ఇంకా బోలెడన్ని ఇళ్ళు పిలవాలి. శ్రావణశుక్రవారం వరలక్ష్మీదేవికి హారతి ఇస్తున్నాను. తప్పక పేరంటానికి రావాలిసుమా!"

"అలాగే!" అంది పార్వతి.

"ఓహ్ సరోజ ఎంత దృష్టవంతురాలు! అందుకే అదృష్టం ఒకరి వారసత్వంకాదు! అని అంటారు పెద్దలు!"

"అదేమిటి పార్వతీ! నీలో నువ్వే మాట్లాడుకుంటు న్నావు?" అంటున్న భర్త మాటలతో గాభరాపడింది పార్వతి.

"ఉన్నపళాన పగటికలలు కనటంలో మీ ఆడవాళ్ళు సిద్ధహస్తులు!" విశ్వం నవ్వుతో శృతికలిపింది పార్వతి.

పేరంటానికి బయల్దేరిన పార్వతి ఎంత హుషారుగా వెళ్ళిందో, పేరంటం నుంచి తిరిగి వచ్చాకా, ఆమెలో తిరిగీ

అంత నిస్పృహా చోటుచేసుకుంది! మరీమరీ వద్దన్నా, సరోజ ఐశ్వర్యం, సరోజ మాటలూ గెర్తుకు వస్తున్నాయి.

"అయ్యయ్యో! అంత చిన్న ఇల్లుకు ముప్పై రూపాయలు బాడుగ ఎందు కిచ్చుకుంటున్నారో మీరు? ఎంత దండుగ పార్వతీ? శుభ్రంగా ఓ బంగళా కొనెయ్యకూడదూ మీరు? ఈ బాడుగిళ్ళ బాధపడలేక, లక్షా ఇరవై వేలు పెట్టి ఈ బంగళా కొనేశాం మేము!" పేరంటాళ్ళందరి ముందూ సగర్వంగా చెప్పుకుంది సరోజ.

"తన భర్త గుమాస్తా అని సరోజకు తెలుసు. తనకు బంగళా కొనే తాహతు లేదనీ సరోజకు తెలుసు! కాని అలాటి సలహా యివ్వటంలో అతిశయం వెల్లడించుకొంటుంది. తనను కించపరుస్తోంది కూడా!' అనుకుంది పార్వతి.

"ఇలాటి నేతచీరెలు కట్టుకొని నువ్వెలా భరిస్తావో గానీ పార్వతీ! మావారు మోజుపడి ఆ మధ్య ఓ నేతచీర నలభై రూపాయలు పెట్టి తెచ్చారు. అరగంటసేపు ఒంటిమీద వుంచుకోలేకపోయానంటే నమ్ము. వెధవనేతలు, ఒంటికి అతుక్కుపోయి నానాగలీజుగా వుంటాయి!" పార్వతి బట్టల వేపు నిశితంగా చూస్తూ అంది సరోజ మళ్ళీ! పార్వతి పలకలేదు.

"కాకున్నా గొర్రెతోక ఆదాయాల ఉద్యోగాలు, పార్వతీ, ఇవి! తండ్రి గుమస్తా, కొడుకు గుమస్తా, ఇలా తరతరాలు సాగిపోవలసిందే! అందుకే మావారు చేస్తోండిన హెల్తాఫీసరు ఉద్యోగానికి ఠతపోరి రాజీనామా ఇప్పించాను.

అప్పు తెచ్చి పెట్టుబడి పెట్టి వ్యాపారంలోకి వారు దిగేందుకు ప్రోత్సాహపరిచింది నేనే! నువ్వే చెప్పు పార్వతీ! ఆ హెల్త్ ఆఫీసరు ఉద్యోగంలోనే ఉండివుంటే ఈ జన్మలో కాదు కదా, మరో నాలుగు జన్మలు వెళ్ళాకయినా మేమిలాంటి బంగళా కొనగలమంటావా?

పార్వతి ఏమంటుంది? సరోజ మాటల్లో అతిశయంతో బాటు నిజమూ దాగిఉంది! నిజమే మరి! ఇప్పుడు విశ్వం గుమస్తా! ఎప్పుడో ప్రమోషన్ వస్తుందని ఆశ. వస్తుందో ఛస్తుందో ఎవరికెరుక? వస్తున్న నూటఎనభై రూపాయలూ సరిపోతున్నాయి. సరోజ చెప్పినట్లు గోపీకూడా తండ్రిలానే ఇలా గే...? ఆ భావం రాగానే భయంతో కంపించిపోయింది పార్వతి. భయంతో బాటు, విశ్వంకూడా సరోజ భర్తలా ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి, వ్యాపారంలోకి దిగితే? అనే భావం కూడా లీలగా మెదలింది!

"పేరంటం పూర్తి అయిందా పార్వతీ!" అన్నాడు విశ్వం.

"ఊఁ" నిర్లిప్తంగా జవాబిచ్చింది పార్వతి.

"అదేం అలావున్నావు? మీ స్నేహితురాలు సరిగ్గా మర్యాద చెయ్యలేదా?" ఉసూరుమంటున్న పార్వతి వేపు విశితంగా చూస్తూ అడిగాడు విశ్వం.

"ఎందుకులేదు? ఇదిగో తాంబూలంలో పెట్టి నాకు ప్రత్యేకంగా ఈ బుట్టలో కమలాలూ ఆపిల్సూ, అరటి పళ్లూ..."

"స్టాప్! ఫుల్‌స్టాప్, పార్వతీ! ఇన్నిరకాలూ నీకే ఇచ్చిందా? అందరికీనా?"

"ఏమో అదంతా నాకు తెలియదు. కాని ఎందరికిచ్చినా తరగని ఐశ్వర్యం, అదృష్టం ఆమెది." చీరె మార్చుకోవటానికి లోపలికి వెళుతున్న పార్వతి నలాగే చూస్తుండిపోయాడు విశ్వం.

"వెయ్యిన్నీ ఒక్క తెల్ల కమలాలతో వరలక్ష్మికి పూజ చేయించింది! పెద్ద మంటపం, పాలవెల్లి, జల్బుతోరణం, కళ్ళు చెదిరేలా ఉంది! ప్రత్యేకం తెల్ల కమలాలు మద్రాసునుంచి తెప్పించాడట వాళ్ళాయన!" చీరె మార్చుకుని బయటికి వస్తూనే అంది పార్వతి.

"ఊం!"

సరోజను గురించి అలా చెబుతూనే ఉంది పార్వతి. పిల్లలు భోజనాలు చేసి పడుకుని నిద్రపోయారు.

"ఏమండీ!" మెల్లిగా పిలిచింది పార్వతి.

"ఏమిటండీ?" అన్నాడు విశ్వం నవ్వుతూ.

"మీరుకూడ ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేసి, ఏదయినా వ్యాపారంలోకి దిగకూడదూ?"

ఆశ్చర్యంగా క్షణకాలం రెప్పపాటు లేకుండా చూశాడు విశ్వం.

"అలా విస్తుపోతారేం! మీరే ఆలోచించండి.

మీలానే మన గోపీకూడా ఓ గుమాస్తా అవుతాడు. ఏనాటికీ మన ఆర్థిక సౌకర్యాలిలాగే ఉంటాయి. అవునా?"

విశ్వానికంతా అర్థమయింది. గాఢంగా నిట్టూర్చాడు

"అదా నీ భయం! మా తాతగారు వెంకటగిరి మహారాజా దగ్గిర దివాన్‌జీగా పనిచేస్తూండేవారుట! లంకంత ఇల్లుతో, తోటలతో ఆ కాలంలో అపరకుబేరుడులా వెలిగి పోయేవారట! కానీ సంస్థానాలు మట్టిపాలయ్యాక ఆయన మా నాన్నగారి కిచ్చిన ఈనామేమిటో నీకు గుర్తుందా? పౌరోహిత్యం! చిల్లిగవ్వ అస్తి చేతిలో లేకుండా, కేవలం వేదాన్ని నమ్ముకుని, అమ్ముకోని మా నాన్నగారు గౌరవంగా బ్రతకలేదా? నన్నింత మనిషిగా నలుగురిలో భుక్తికీ, పరువు ప్రతిష్ఠలకూ, లోపంలేకుండా బ్రతకగల వ్యక్తిగా తయారు చెయ్యలేదా? నీలానే మా అమ్మ ఆలోచించి వుంటే, అదే నిజమయితే నేనుకూడా ఈనాడు మా నాన్నగారిలానే, ఏ వివాహానికో ఆబ్దికానికో హాజరయి మంత్రాలు వల్లిస్తుండే వాణ్ణికాదా?"

విశ్వం అలా చెబుతూంటే సమాధానం తోచలేదు పార్వతికి.

"పిచ్చిపార్వతీ! ఎవరి అదృష్టం వాళ్ళది! మన గోపీ గుమస్తాయే అవుతాడో, గవర్నరే అవుతాడో నిర్ణయించవలిసింది మనం కాదు; భగవంతుడు! మనకున్నదానిలో మన బిడ్డల అభివృద్ధి కాంక్షించాలేగాని, వెర్రిమొర్రి గొప్పల కోసం, ఉన్న పరిస్థితులను తారుమారు చేసుకోవటం వెర్రితనం!"

పార్వతికి ఈ జవాబేమీ రుచించలేదు.

"అలా అని చేతులు ముడుచుకు కూర్చుందామా?" అంది కోపంగా.

"ఏం చెయ్యమంటావో చెప్పు?" అసహనంగా అరిచాడు విశ్వం.

"ముందీ ఉద్యోగానికి రాజీనామా ఇచ్చెయ్యండి."

"తరువాత తలో జోలె పుచ్చుకుందామా?" కోపంగా అన్నాడు విశ్వం.

"వ్యాపారంలోకి దిగుదాం."

"పార్వతీ! నీ కెలా చెప్పాలో నా కర్థంకావటం లేదు. వ్యాపారమనేది తమాషా విషయం కాదు. ఎంతోమంది డిగ్రీలు పుచ్చుకుని ఉద్యోగాలు దొరక్క యాతన పడుతున్న ఈ రోజుల్లో ఉన్న ఉద్యోగానికి రాజీనామా ఇమ్మనే వెర్రి బాగుల మనిషిని నిన్నొక్కర్తెనే చూస్తున్నాను. వ్యాపారం చెయ్యాలంటే వేల సంఖ్యతో పెట్టుబడి కావాలి. వ్యాపారం సరళంగా సాగి లాభాలు బాగా వచ్చేవరకూ భుక్తి జరుగుతూండాలి. ఇన్ని ఉన్నా ఒక్కోసారి పూర్తిగా మునిగి బికారు లవుతుంటారు కొందరు."

"మీ రెన్నైనా చెప్పండి. సరోజ మొగుడేం మీ కంటె తెలివిగలవాడా?

"సరోజ! సరోజ! సరోజ! అస్తమానం అదే స్మరణా? సరోజతో నిన్ను నువ్వు పోల్చుకోవడంవల్లే ఇంత

అనర్థం వచ్చింది ! ఒకరితో పోటీ ఎందుకు ? మన కిప్పుడేం తక్కువయిందనీ ? వెర్రి ఆలోచనలు చెయ్యక పడుకో.''

ఇక వాదన ఆస్కారం లేకుండా విశ్వం కోపంగా దుప్పటిముసుగుతన్నాడు.

కాని పార్వతి మనస్సులో సన్నని మేఘశకలంలా ప్రవేశించిన ఆ భావం పీఠం వేసుకు కూర్చుని రోజులు దొర్లుతున్న కొద్దీ పెరిగి పెద్దదౌతూంది.

''మనం సరదాగా సినిమాకు వెళదాం, పార్వతీ !'' అంటాడు విశ్వం.

''వెధవ రోడ్లూ, వెధవ రిక్షాలూ, నే రాలేను !''

''సుమారు ఆరేళ్ళుగా ఈ వెధవరోడ్లమీదే, వెధవరిక్షాల్లోనే వెడుతున్నాం. ఈ రోజు కొత్తగా కార్లు వస్తాయా ?''

''కారు ! హుఁ, ఆ పేరు ఉచ్చరించేపాటి అదృష్టం కూడానా నా బతుక్కి !''

ఆలాటి వాగ్బాణాల తరువాత మౌనం ఇష్టారాజ్యం చేస్తుంది.

''బాబిగాడి బట్టలలా మాసి ఉన్నాయేం ?'' అనివిశ్వం అనగానే; ''వాడి కేకంగా ఓ వంద జతలున్నాయా ఏమిటి, రోజూ ఇస్త్రీబట్టలు తొడగటానికి ! వాడికి తనో గుమాస్తాగారి కొడుకునని తెలియకపోవచ్చు గానీ, నాకు తెలుసు !''

ఇలాటి సంభాషణలతో వాతావరణం కలుషితమై పోయింది.

"అలా ఎందుకన్నానా ?" అని విశ్వం మొహంలో మార్పులు చూసి పశ్చాత్తాప పడుతుందేగానీ, ఎప్పటికీప్పుడు హృదయంలో గూడు కట్టుకుని వున్న అసంతృప్తి పెదవులను వారించటం లేదు. తన మాట విని భర్త బారీఎత్తున డబ్బు గడించే మార్గం అన్వేషించటం లేదని అక్కసు, సరోజముందు తన దర్పం చూపించుకోవాలనే ప్రగాఢ కాంక్ష పార్వతిని నిలవనీయటం లేదు. ఆ అసంతృప్తే ఆమెను నిలువెల్లా దహించి వేస్తూంది. ఇంట్లో పరిచితమైన పాతర సామానులు మొదలు భర్తవరకూ ఆమె కన్నీ హీనంగా, దుర్భరంగా గోచరిస్తున్నాయి.

"కొన్ని రోజు లలా మా పుట్టింటికి వెళ్ళాలని వుంది," పొడిగా అంది పార్వతి, అలా బెదిరింపుగానైనా విశ్వంలో మార్పు తేవచ్చుననే వుద్దేశ్యంతో.

"నేనూ అదే అనుకుంటున్నాను, పార్వతీ ! కొంత కాలం యీ వాతావరణంనుంచి నిన్ను మార్చటమే మంచి దనిపిస్తూంది" అన్నాడు విశ్వం. తొణుకుబెణుకు లేకుండా భర్త ఇచ్చిన సమాధానానికి ఊరటకంటే అశాంతే చెలరేగింది పార్వతిలో. అయినా ఇక మాట వెనక్కు తీసుకునే సాహసం లేకపోయింది. వెంటనే బయలుదేరింది పిల్లల్ని తీసుకుని.

"నెల్లూర్!" పెట్టెలో యెవరో గావుకేక పెట్టారు. ఆలోచనలకు స్వస్తిచెప్పి బగబా గోపీని లేపి సామాను సర్ది, పాపను యెత్తుకుంది పార్వతి.

*　　*　　*

"నువ్వు వచ్చి వారం రోజు లైందని తెలిసిందేగానీ, చూచివద్దామని ఏ రోజు కా రోజు ప్రయాణమవుతున్నానే, పార్వతీ! ఏదీ, తెమిలిచస్తేనా? పిల్లలూ చాకిరీ సరిపోతూంది. ఇవి చాలవన్నట్లు మా అత్తగారికి రోగం! చెయ్యలేక చస్తున్నా ననుకో! కరువులో అధికమాసమని రెండేళ్ళుగా మా ఆడబిడ్డ భర్తగారికి ఇక్కడే ఉద్యోగమయింది. ఆవిడా, ఇద్దరు పిల్లలూ, ఆయనా అంతా మాఇంట్లోనేఉంటున్నారు.

అన్నపూర్ణ వస్తూనే తన సొద వెళ్ళబోసుకుంది. స్నేహితురాలిని సాదరంగా ఆహ్వానించింది పార్వతి.

"అలా బలహీనంగా వున్నావేమిటి. పార్వతీ? మళ్ళీ నెల తప్పిందా ఏమిటి?" అన్నపూర్ణ పార్వతిని పరీక్షగా చూస్తూ అడిగింది.

"ఇంకా నయం ఆ ఖర్మకూడా దాపరించలేదు! ఈ జన్మకు యిక నెల తప్పే బాధ లేకుండా మావారు వేసక్టమీ చేయించుకున్నారు!" అంది పార్వతి.

"మంచిపని చేశారు, మాలా నాలుగేళ్ళకు ముగ్గుర్ని కనిపారెయ్యకుండా!" ఈసడింపుగా అన్నది అన్నపూర్ణ.

"నీకు?" పార్వతి ఆశ్చర్యంగా అడిగింది.

"ఆఁ! నాకు ప్రతి సంవత్సన్నరకూ కాన్పే! ముగ్గురు పోయారు. ముగ్గురున్నారు ఇక ఎంతమంది పుడతారో తెలియదు!" అంది అన్నపూర్ణ దాదాపు కళ్ళనీళ్లు పెట్టుకుంటూ.

"మీ దంపతులు మాట్లాడుకుని ఎవరో ఒకరు ఆపరేషన్ చేయించుకోగూడదూ?" అంది పార్వతి సలహా జోడిస్తూ.

"ఎందుకు చేయించుకోగూడదు? కాని అందరూ నీలాంటి అదృష్టవంతులే వుంటారంటావా?" అన్నపూర్ణ ముఖంలో అసూయ కొట్టవచ్చినట్లు కనిపించింది పార్వతికి. క్షణకాలం ఆశ్చర్యపోయింది. తను అదృష్టవంతురాలా? ఏ విషయంలో?

అన్నపూర్ణ పార్వతి ఆలోచనలను గురించి పట్టించుకోలేదు. అలాగే చెప్పుకుపోతూంది.

"ఇద్దరు పిల్లలు పుట్టగానే మీవారు చూడు ఎంచక్కా ఆపరేషన్ చేయించుకున్నారో! మావా రలా కాదే! తను వేసక్టమీ చేయించుకుంటే, తిరిగి నాకు ఒకవేళ (నాఖర్మతే!) గర్భం వస్తే, తను అవమానంపాలు కావలసి వుంటుందేమోనని భయమట! అదీగాక వేసక్టమీ చేయించుకుంటే పురుషులు బలహీనులై ఎందుకూ పనికిరాకుండా పోతారని ఎవరో ప్రబుద్ధులు ఈయనగారితో చెప్పారట!"

"మూర్ఖులు!"

"ఎవరు? చెప్పినవాళ్ళు కాదు...నన్నడిగితే విని ఆ గాలికబుర్లు నిజమని నమ్మేవాళ్ళు మూర్ఖులంటాను!"

"పోనీ. నువ్వే ఆపరేషన్ చేయించుకో లేకపోయావ్ యీ గొడవకం టే ?"

"కాని అందుకూ ఒప్పుకోరుగా? నేను ఆపరేషన్ చేయించుకుంటే ఆరు నెలల వరకూ మంచం దిగకూడదేమో నని శంక ! ఈ లోగా ఇల్లెలా జరగాలి ? అని ప్రశ్న. తీరా ఈయనగారిని ఒప్పించగలిగానా, మంచంలో వుండే మా అత్తగారు, ఇంట్లో వున్న ఆడబిడ్డ అడ్డంపడతారు నానాగోల చేస్తూ. దానితో మతిపోయి 'పైసారి చూద్దాంలే !' అనడం ఈయనగారికి పరిపాటి అయిపోయింది. ప్రతిసారి కనడం నాకూ అలవాటయి పోయింది ! పార్వతీ ఎవర్ని అనుకుని ఏం ప్రయోజనం చెప్పు ? నా ఖర్మ ! నేను రోజుకు వెయ్యిమార్లు అనుకుంటుంటాను, 'మా పార్వతి అదృష్టవంతురాలు !' అని.

"చిన్న సంసారం, వివేకవంతుడయిన భర్త, ఆదాయానికి తగ్గ పరిమిత కుటుంబం, అత్తలూ, ఆడబిడ్డలూ, సాధింపులూ, బాధలూ లేని స్వర్గం నీది!"

చాలాసేపు కూర్చుని కబుర్లు చెప్పి వెళ్ళిపోయింది అన్నపూర్ణ. అన్నపూర్ణ వెళ్ళిపోయాక ఎంతసేపో అలాగే కూర్చుండిపోయింది. పార్వతి. అన్నపూర్ణ మాటలు మరీమరీ చెవుల్లో ప్రతిధ్వనించాయి. "చిన్న సంసారం. వివేకవంతుడయిన భర్త, ఆదాయానికి తగ్గ పరిమిత కుటుంబం అత్తలూ, ఆడబిడ్డలూ. సాధింపులూ, బాధలూ లేని స్వర్గం నీది !"

అవునేమో ! తన భర్తే అన్నపూర్ణ భర్త లాంటి వాడయివుంటే ? అమ్మయ్యో, ఇంకేమైనా వుందా ! అసలు

తనకూ కుటుంబ నియంత్రణాన్ని గురించి ఎన్నో సందేహాలు వుండేవి! అందుకే పాప కాన్పుకు ముందు తనను హాస్పిటల్లో చేర్చి, "నీ కాన్పు కాగానే నేను వేసక్టమీ చేయించుకుంటాను, పార్వతీ!" అన్నాడు విశ్వం ఆ రోజు.

"వద్దండీ! నాకేమిటో భయం. పోనీ. నేనే ఆపరేషన్ చేయించుకుంటా లెండి!" అంది పార్వతి తను విన్న పుకార్ల సందేహాలతో.

"అదే పార్వతీ, మీ ఆడవాళ్ళతో వచ్చిన చిక్కు! పురుషుడికి సర్వస్వం అర్పించుకుంటారు. అంతటితో ఆగక అతడి కాలిలో ముల్లు గుచ్చుకుంటుందేమో నన్న భయంతో ముందుగానే మీ కన్ను పొడుచుకోవటానికి సిద్ధపడతారు! అయితేనేం? స్త్రీలో మూర్తీభవించి వున్న ఈ త్యాగాన్ని పురుషులు గుర్తిస్తున్నారా? లేదు! అతడి స్వార్థం అతడిది! అతడి సుఖం అతడిది! స్త్రీలు నవమాసాలూ మోసి, ప్రాణాంతకమైన బాధ ఓర్చుకొని పిల్లలను అందిస్తే, ఎత్తుకు ముద్దాడుతూ 'వీళ్ళు నా పిల్లలు'! అంటూ ఛాతీ విరుచుకు పదిమందికిచూపే పురుషుడు, అంత స్వార్థత్యాగం చేసే ఇల్లాలి కోసం కాస్త బాధను కాస్తంత కోతనూ భరించలేడూ! ఎందుకు భరించకూడదు! అసలా మాత్రం బాధనూడా తను పడకుండా తప్పించుకోవటానికే రకరకాల కారణాలూ, సందేహాలూ వలలా చేసి చూపిస్తున్నాడు! 'ఎలాగూ కష్టపడి పిల్లల్ని కంటూనే వున్నారు. ఈ కాస్త బాధా మీరే అనుభవించండి' అంటూ తియ్యగా చెప్పి మీ ఆపరేషన్‌కు మిమ్మల్ని ప్రోత్సహిస్తున్నాడు."

విశ్వం అలా వుద్రిక్తంగా చెబుతూవుంటే పార్వతికి మెనలేని అనురాగం ముంచుకువచ్చింది. "మీలాంటివాళ్ళు వందకొక్క మనిషివున్న స్త్రీజాతి ఇంకా అభివృద్ధిలోకి వచ్చేది కదూ?" అంది ప్రేమగా చూస్తూ.

"ఒక జాతిని వుద్ధరించగల శక్తీ, మరో జాతికి బోధించి ఆచరింపచేయగల అర్హతా, ఆర్థిక స్తోమతా కూడా నాకు లేవు. ముందు నన్ను నేను సంస్కరించుకోనీ, చాలు!" అన్నాడు నవ్వుతూ విశ్వం.

ఆనాటి భర్తమాటలు తలుచుకుంటూంటే ఒళ్లు పులకరించింది పార్వతికి. అన్నపూర్ణ భర్త ఎంత మూర్ఖుడు! తన భర్త ఎంత ఉత్తముడు! రెండు వందల రూపాయలు సంపాదించే అన్నపూర్ణ భర్త ఇంట్లో ఎంత రద్దీ? ఎంత బాధ? ఎంత అసంతృప్తి? ఎంత ఆవేదన? తనఇంట్లోనా? ఇద్దరు పిల్లలు! ఉత్తముడైన భర్తా, తనూ! స్వర్గంకాక మరేమిటి?

వారం రోజులుగా కుదరని, శాంతి, నెలరోజుల క్రితం మాయమైన ప్రశాంతత ఏదో అనిర్వచనీయమైన ఆనందంతో బాటు వచ్చి పార్వతి హృదయంలో చోటుచేసుకున్నాయి.

"ఆయన ఒక్కరు వంట చేసుకుంటూ యిబ్బందిపడుతూంటారమ్మా! నేను త్వరగా వెళ్ళాలి!' అంది పార్వతి తల్లితో మరునాడు.

"అదేమిటే? మొన్న ఓ నెలరోజులుంటానన్నావ్! ఈలోగా..."

"ఊహుం! నీకు తెలీదులే, అమ్మా!" అంది నసుగుతూ పార్వతి.

"అవునే! నాకు తెలీదు యీ కాలపు పిల్లల వైఖర్లు!" రుసరుసలాడుతూ వెళ్ళిపోయిం దావిడ. పార్వతి చిన్నగా నవ్వుకుంది.

ఊరికి వెళ్ళే ముందురోజు స్నేహితురాలు కమల ఇంటికి వెళ్ళింది పార్వతి. కమల భర్త చిన్న మెకానిక్. ఏదో కంపెనీలో ఎనభై రూపాయలు సంపాదిస్తున్నాడు.

కమల సాదరంగా ఆహ్వానించింది. రెండే రెండు గదులు. బాత్ రూం లేదు. వరండాగానీ, పెరడుగాని ఏమీ లేవు.

"నువ్వేమనుకుంటున్నావో, పార్వతీ! ఇదే మాఇల్లు. ఇదే అతిథుల గది, ఆఫీసుగది, ప్లస్ బెడ్ రూం. ఇదే వంటిల్లు, భోజనాల గది ఎండ్ బాత్ రూం వగైరా! ఆ పెద్ద అలమార్లలో పెట్టెలూ, సామాన్లూ వగైరా పెట్టుకుంటాం. ఒక్కోసారి మా పిల్లల ఆటప్రదేశాలు కూడా అలమార్లే! ఏం చెయ్యమంటావ్ చెప్పు? ఈ ఇంటికే పాతిక రూపాయలు బాడుగ! మా శక్తికి మించినది. ఇక ఏభై అయిదు రూపాయల్లో అప్పులేకుండా సంసారం సాగాలంటే మా పరిస్థితి నువ్వు ఊహించుకో, పార్వతీ!' అరమర లేకుండా చెప్పింది కమల.

పార్వతి కెవరో నెత్తిన కొట్టినట్లయ్యింది! 'ఏభై అయిదురూపాయలు! ఇద్దరుపిల్లలు! ఇద్దరు పెద్దలు! భగవాన్!

తన పరిస్థితి ఇంతకంటే ఎంతో మెరుగ్గా ఉంది! అయినా తనెంత అసంతృప్తి పడుతూంది! ఛీ, తను ఆడదా? రాక్షసా? ఎన్ని విధాలుగా భర్తను అవమానించింది? హింసించింది మాటలతో! తమకంటే తక్కువ స్థితిలో రకరకాల బాధలతో బతికే ఎన్ని సంసారాలున్నాయి? వాళ్ళంతా తనలానే అసంతృప్తితో బాధపడుతున్నారా?!

"సరోజ అక్కడే ఉందటకదూ? మీ ఇంటికి ఎప్పుడేనా వచ్చిందా?" కమల ప్రశ్నతో తుళ్ళిపడింది పార్వతి.

"ఆఁ! ఒకటి రెండు మార్లు వచ్చింది. నేనూ ఓసారి వాళ్ళింటికి వెళ్ళాను. మనిషి చాలా మారిపోయింది. ఎంత డబ్బుందనుకున్నావ్?" అంది పార్వతి.

"ఆఁ, ఎంత డబ్బుంటే ఏంలాభం?" ఈసడించింది కమల.

"అదేం, అలా అంటావు?"

"ఇంకెలా అనమంటావ్, పార్వతీ! మమ్మల్ని చూడు. వారికి వచ్చేది తక్కువజీతమే కావచ్చు. మేము ఆర్థికంగా హీనస్థితిలోనే వుండవచ్చు. కానీ మా ఇద్దరిమధ్యా ఎంత అనురాగం! చెబితే అతిశయం అనుకుంటావేమోగానీ, నేను కాస్త బడలిక చెందితేచాలు, వారు గిలగిల లాడిపోతారు! వున్నంతలో అర చేతుల్లో పెట్టుకుని నన్ను లాలిస్తారు! ఇద్దరు పిల్లలు చాలని ఆపరేషన్ చేయించుకున్నారు! వెధవడబ్బు! లేకుంటే ఏం? అనురాగమూ అభిమానమూ అనేవి కరువయ్యాక ఎంత ఐశ్వర్యంవుంటే ఎందుకు?"

"ఇప్పుడు సరోజకేం తక్కువా?" అనుమానంగా అడిగింది పార్వతి.

"నగలకు తక్కువలేదు. విలాసాలకు తక్కువలేదు. కానీ స్త్రీ వీటన్నిటికంటే ఎక్కువగా కోరే భర్త అనురాగమే తక్కువ!"

"నిజం?" ఆశ్చర్యంగా అడిగింది పార్వతి.

అబద్ధం చెప్పవలసిన అవసరం నాకు లేదు, పార్వతీ! సరోజ భర్తకు ధనంతోపాటు దుర్వ్యసనాలూ హెచ్చాయట! అస్తమానం నైట్‌క్లబ్బుల్లో, తప్పితే వేశ్యాగృహాల్లోనే ఉంటాడట! ఒక్కోసారి తన కంటికి నచ్చిన అమ్మాయిని ఇంటికే పిలుచుకు వస్తాడట ఏకంగా!"

"సరోజ ఇవన్నీ సహిస్తూందా?"

"సహించకేం చేస్తుంది? డబ్బుతో దాని నోరు మూయించాడు. ఇంకా నోరెత్తితే హంటర్‌తో చావగొడతాడట!"

"ఇవన్నీ నీకెవరు చెప్పారు, కమలా?" విస్మయంగా అడిగింది పార్వతి.

"ఎవరేనా చెబితే నమ్మేదాన్ని కాదు. ఈ మధ్య ఓ ఉత్తరం వ్రాసిందది! చూపిస్తానువుండు!" కమల లేచివెళ్ళి ఓ కవరు తెచ్చింది.

అంతా చదివిన పార్వతికి కళ్ళు బైర్లు కమ్మినట్లయ్యాయి. వేగంగా ఇంటికి వచ్చింది...

*   *   *

రైలు అంటే వేగంగా వెళ్ళి భర్త పాదాలమీద పడి క్షమాపణ వేడుకోవాలనిపిస్తూంది పార్వతికి. అందుకే ఏ స్టేషన్‌లో ట్రెయిన్ ఆగినా విసుక్కుంటూంది, వెధవ రైళ్ళు! ఎంత లేటుగా ఎంత నెమ్మదిగా వెళుతున్నాయి? మెయిల్లో ఎక్కినా బాగుండేది!

జాబూ, జవాబూ లేకుండా ఆదివారం రిక్షాదిగి వస్తున్న భార్యనూ, పిల్లల్నీ చూచి ఆశ్చర్యపోయాడు విశ్వం.

"ఇదేమిటి? జాబు వ్రాస్తే స్టేషన్‌కు నేను వచ్చే వాణ్ణిగా?" అన్నాడు పాప నెత్తుకుంటూ.

"నాకు ఇల్లు తెలుసుగా?" అంది పార్వతి నవ్వుతూ.

ఇంత ప్రసన్నంగా, ఇంత త్వరలో పార్వతిని చూద్దామనుకోని విశ్వం ఆశ్చర్యంగానే చూస్తూండిపోయాడు కాసేపు. ఆ తరువాత ఆ ముక్కే పైకి అన్నాడు.

"ఓ, అదంతా ఓ పెద్ద కథలెండి. తరువాత చెబుతాను!" అంది పార్వతి భర్త స్వయంపాకంతో చిందరవందరగా తయారయిన వంటయింటిని ఓ కొలిక్కి తెచ్చే ప్రయత్నానికి నాంది పలుకుతూ.

ఆ రాత్రి పార్వతి చెబుతున్న మాటలూ, ఆమె పశ్చాత్తాపమూ వింటూ తన్మయుడయ్యాడు విశ్వం.

"పార్వతీ! ఎప్పుడూ మనకంటే హెచ్చు అంతస్తులో ఉన్న వాళ్ళతో మనల్ని పోల్చుకుంటే మనకు మిగిలేది అసంతృప్తీ, ఆవేదనా మాత్రమే, మనకంటే తక్కువ స్థితిలో ఉన్న వాళ్లతో

సరిపోల్చుకుంటే మనం వారికంటే ఎన్నోరెట్లు అధికులమనే ఆత్మవిశ్వాసం ఏర్పడుతుంది! అలాకాక నీకంటే అధికులతో నిన్ను పోల్చుకో దలిచినప్పుడు వారిలోని గుణగణాలతో నిన్ను సరిపోల్చుకో. దయా, ధర్మమూ, సంస్కారమూ, వివేకమూ వగైరా సద్గుణాలు నీకంటే ఎక్కువగా ఇతరులలో ఉంటే వారిని చూచి అసూయపడు. ఆ గుణాలలో వారికంటే మిన్నగా ఉండాలని వారితో పోటీపడు. అప్పుడు కలిగే మానసిక తృప్తి వేరు. కానీ ఒకనాడు మురిపించి మరునాడు నరికించే ఐశ్వర్యం చూచి ఈర్ష్యపడకు. అలాటి సంపద నీకు లేదని బాధ పడకు.''

భర్తహృదయంమీద తలవాల్చి ఉన్న పార్వతికి విశ్వం మాటలు అమృతపుధార లనిపించాయి.

''అవును మీరు చెప్పింది నిజం!'' అంది తృప్తిగా. ఆమె చెవుల్లో అన్నపూర్ణ మాటలు ప్రతిధ్వనించాయి.

''వివేకవంతుడయిన భర్త, ఆదాయానికి తగిన పరిమిత కుటుంబం, అత్తలూ, ఆడబిడ్డలూ, సాధింపులూ, బాధలూ లేని స్వర్గం...''

''అవును. ఈ స్వర్గం చాలు. నాకీ స్వర్గంచాలు. భగవాన్! ఇక నేనేమీ కోరను. భగవాన్! నేనేమీ కోరను!''

భర్త హృదయంలో మరింతగా ఒదిగిపోతూ మౌనంగా ప్రార్థిస్తూ, తృప్తిగా నిట్టూర్చింది పార్వతి.

—♦ ○ ♦—